క్లుప్తంగా

'ట్రినిటి'లో టెక్నోస్పార్క్-2కె25



విద్యార్థుల ప్రదర్శనలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటి ఇంజనీరింగ్ కాలేజీలో మంగళవారం టెక్నోస్పార్క్-2కె25 సింపోజియంను ట్రాన్స్‌కో ఏడీఈ రాజు, కళాశాల అకడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్ ప్రారంభించారు. పలు అంశాలపై విద్యార్థులు ప్రదర్శించిన అంశాలను తిలకించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి నగదు, ప్రశంసాపత్రాలు అందించారు. ప్రిన్సిపాల్ మణిగణేశ్, ఏవో సురేశ్, రాజిరెడ్డి, హెచ్‌వోడీలు నటరాజన్, ఆరిఫ్, స్వాతి, ప్రభాకర్, పద్మిని ఉన్నారు.

గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

కమాన్‌పూర్: మండలంలోని రొంపికుంట గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బాద్రపు శంకర్ మంగళవారం మంత్రి శ్రీధర్ బాబును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని చెరువు కట్టపై సీసీరోడ్డు, కమ్యూనిటీ హాల్, ఇంటర్నల్ సీసీరోడ్లు, పేరపల్లి నుంచి గుంటూర్‌పల్లె వరకు డబుల్‌రోడ్ల నిర్మాణం చేపట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఆమె నేత్రాలు సజీవం

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని శివాజీ నగర్‌లో నివాసం ఉంటున్న బొద్దుల రాయమల్లమ్మ (70) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. కాగా ఆమె కళ్లను కుటుంబ సభ్యులు దానం చేసి ఆదర్శంగా నిలిచారు. ఆమె కళ్ల దానం చేస్తే, ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించవచ్చని కుటుంబ సభ్యులకు వారి సమీప బంధువు పర్ష రమేశ్ అవగాహన కల్పించగా అంగీకారం తెలిపారు. ఎల్వీ ప్రసాద్ ఐబ్యాంకు సీనియర్ టెక్నీషియన్ ప్రదీప్‌నాయక్ సహకారంతో మృతురాలి నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, గౌరవ అధ్యక్షులు సానా రామకృష్ణారెడ్డి, ముఖ్య సలహాదారులు నూక రమేశ్, కార్యదర్శి భీష్మాచారి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి వాసు, జిల్లా మహిళా అధ్యక్షురాలు వెల్డి కవిత, మగువ లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షురాలు శశికళ కుటుంబ సభ్యులను అభినందించారు. పర్ష రమేశ్, మాజీ సర్పంచ్ కుందారపు బాపు ఉన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా సతీశ్‌రెడ్డి



ధర్మారం: బీజేపీ మండల అధ్యక్షుడిగా మండలంలోని చామనపల్లి గ్రామానికి చెందిన తీగుళ్ల సతీశ్‌రెడ్డిని నియమిస్తూ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరిబాబు ఉత్తర్వులు జారీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడిగా నియామకమైన సతీశ్‌రెడ్డిని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు గుజ్జుల రామకృష్ణారెడ్డి మంగళవారం సన్మానించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి శివారు రంగంపల్లి, గుండమ్మకట్ట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల భూంనగర్, వాసవినగర్, శివపురికాలనీ టీచర్స్‌కాలనీ, మార్కెట్‌ఏరియా, ప్రగతినగర్, క్రిస్టియన్‌కాలనీ, చందర్‌కాక నగర్, కొంతంవాడ ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ రాజ్‌కుమార్ తెలిపారు. ఉదయం 7:30 గంటల నుంచి 10 వరకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

'డబుల్‌బెడ్రూం' నిర్మాణ పనుల పరిశీలన

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి శివారులో నిర్మిస్తున్న డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులను మంగళవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, ఏఈ సతీశ్ పరిశీలించారు. డబుల్ ఇళ్లు ఉన్న ప్రాంతాల్లో చేపట్టిన కనీస మౌలిక వసతులను కల్పించేందుకు చేపట్టిన పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. వాటర్‌ట్యాంకు, విద్యుత్ పరమైన పనులు పూర్తికావొచ్చాయన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ వాణి ఉన్నారు.

ముల్కలపల్లిలో రేషన్‌షాపు ప్రారంభం

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి గ్రామ పరిధిలోని ముల్కలపల్లిలో రేషన్‌షాపును మంగళవారం ప్రారంభించారు. ముల్కలపల్లి ప్రజలు రేషన్ తీసుకునేందుకు ఆదర్శనగర్‌కు వచ్చేవారు. ముల్కలపల్లి నుంచి ఆదర్శనగర్‌కు రావడానికి చాలా ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఇటీవల మంత్రి శ్రీధర్‌బాబుకు విన్నవించారు. కాగా ముల్కలపల్లిలో రేషన్‌షాపును ప్రారంభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాలికా సాధికారతకు ఎన్టీపీసీ కృషి

- ఎన్టీపీసీ రామగుండం-తెలంగాణ ప్రాజెక్టు ఈడీ చందన్‌కుమార్ సామంత
- బాలికా సాధికారత మిషన్-2025లో భాగంగా 28రోజుల రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ ప్రారంభం



శిక్షణ పొందే బాలికలతో ఈడీ చందన్‌కుమార్ సామంత

జ్యోతినగర్: బాలికా సాధికారతకు ఎన్టీపీసీ రామగుండం కృషి చేస్తుందని ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్‌కుమార్ సామంత అన్నారు. పర్మినెంట్ టౌన్‌షిప్ కాకతీయ ఆడిటోరియంలో సీఎస్సార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికా సాధికారత మిషన్-2025లో భాగంగా 28 రోజుల పాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న నాలుగో తరగతి బాలికలకు రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శిక్షణలో బాలికలకు స్టడీ కిట్‌తో పాటు యూనిఫాం అందించారు. కార్యక్రమంలో దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు రాఖీ సామంత, సీనియర్ సభ్యులు, యూనియన్, అసోసియేషన్ల ప్రతినిధులు, ఉన్నతాధికారులు, తల్లిదండ్రులు, బాలికలు పాల్గొన్నారు.

బాలికా సాధికారత మిషన్ ప్రారంభం..

2018లో ఎన్టీపీసీ వింధ్యాచల్, రిహాండ్, సింగ్రౌలిలోని ప్రాజెక్టుల్లో ప్రారంభించారు. బాలికా సాధికారత మిషన్ విజయవంతం కావడంతో 2019లో రామగుండం ప్రాజెక్టులో ప్రారంభించారు.

28రోజుల శిక్షణ..

బాలికా సాధికారతకు ఎన్టీపీసీ ప్రధాన లక్ష్యంగా వెనుకబడిన వర్గాల యువతకు అవకాశాలు, మార్గదర్శకత్వం, సమగ్ర అభివృద్ధిని అందించడం ద్వారా వారికి సాధికారత కల్పించడం. రామగుండంలో ప్రారంభమైనప్పటి నుంచి ఈ కార్యక్రమం వందలాది మంది బాలికల జీవితాలకు సానుకూలంగా చేపట్టింది. సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి 120మంది బాలికలకు 28రోజుల రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ అందించనున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో వేసవి జాగ్రత్తలు తీసుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీనాథ్

కాల్వశ్రీరాంపూర్: వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు, రైతులు, హమాలీలు వేసవి జాగ్రత్తలు తీసుకోవాలని ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల కొనుగోలు కేంద్రాల ప్రత్యేకాధికారి ఏడీఏ శ్రీనాథ్ సూచించారు. కాల్వశ్రీరాంపూర్‌లో సింగిల్‌విండో, ఐకేపీ కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన సందర్శించారు. రోజువారీ కాంటాలు, మిల్లులకు తరలించిన ధాన్యం వివరాలను పరిశీలించారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా పాలిథిన్ కప్పాలని, వెంటవెంటనే కాంటాలు వేయడంతో పాటు మిల్లులకు తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, అస్వస్థతకు గురైతే వెంటనే ప్రాథమిక చికిత్స అందించి ఆసుపత్రికి తరలించాలన్నారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఏడీఏను, ఏఈవో ఈశ్వర్‌రెడ్డిని సన్మానించారు. ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, నాయకులు ఎం.సదానందం, పి.దేవేందర్‌రావు, మాదాసు సతీశ్, బంగారి రమేశ్, రవి, రాంచంద్రం, బద్రి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఓవర్ టైం, వారాంతపు సెలవులపై కుదిరిన ఒప్పందం



ఒప్పంద పత్రం అందుకుంటున్న కార్మికసంఘ నాయకులు

జ్యోతినగర్: కేంద్ర కార్మికశాఖ కార్యాలయంలో ఆర్ఎఫ్‌సీఎల్, ఆర్ఎఫ్‌సీఎల్ కార్మిక సంఘాల సమావేశం జరిగింది. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని సెంట్రల్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం ఓవర్‌టైం, వారాంతపు సెలవులపై కార్మిక సంఘ వినతిపత్రాలు అందించిన క్రమంలో చర్చలు కొనసాగాయి. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ మహ్మద్ యూసఫ్ యాజమాన్యంతో పలు దఫాలుగా చర్చలకు సంబంధించిన నోటీసులు జారీ చేయడం జరిగిందని, దీంతో ఇరుపక్షాల మధ్య చర్చలు కొనసాగాయి. ఆర్ఎఫ్‌సీఎల్ కార్మిక సంఘ అధ్యక్షుడు శివ్‌ప్రకాశ్ ప్రజాపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.బిక్షపతి, ప్రధాన కార్యదర్శి అభిషేక్ సింగ్, యాజమాన్యంతో సుదీర్ఘ చర్చల అనంతరం యూనియన్, ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం మధ్య త్రైపాక్షిక ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందంలో భాగంగా ఉద్యోగులు అదనంగా పనిచేసిన కాలానికి ఓవర్ టైం చెల్లించడానికి యాజమాన్యం అంగీకరించిందని నాయకులు తెలిపారు. షిఫ్ట్ రోటర్‌ను ప్రవేశపెట్టి వారాంతపు సెలవును ఏడో రోజు వచ్చేలాగా ఇవ్వడానికి అంగీకరించిందన్నారు. యూనియన్ కోశాధికారి అనిర్బన్ చక్రబర్తి, ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం ప్రతినిధులుగా మేనేజర్ (హెచ్‌ఆర్) మయూక్ ధావన్, అసిస్టెంట్ మేనేజర్ హెచ్‌ఆర్ అజయ్‌కుమార్, రమేశ్ పాల్గొన్నారు.

ఈదురుగాలులకు నేలరాలిన మామిడికాయలు



నేలరాలిన మామిడికాయలు

ఓదెల: మండలంలో సోమవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన కొద్దిపాటి వర్షానికి ఓదెల, పిట్టలఎల్లయ్యపల్లె, గుండ్లపల్లె, లంబాడితండా, అబ్బిడిపల్లి గ్రామాల్లో మామిడితోటల్లో కాయలు కిందరాలాయి. ఆరుగాలం శ్రమించిన మామిడి తోటలు చేతికొచ్చే సమయానికి నేలరాలడంతో నష్టాలపాలయ్యామని యజమానులు మంద సమ్మయ్య, కొమురయ్య, లక్ష్మయ్య, పెంటయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత శాఖాధికారులు సర్వే చేసి పరిహారం ఇప్పించాలని వారు కోరారు.

సంక్షిప్త వార్తలు

• రాజీవ్ రహదారిపై బూడిద టిప్పర్ బోల్తా

రామగుండం: ఎన్టీపీసీ నుంచి బసంత్‌నగర్ వైపు బూడిద లోడుతో వెళ్తున్న టిప్పర్ మంగళవారం మల్యాలపల్లి సబ్‌స్టేషన్ ఎన్టీపీసీ రైల్వే ట్రాక్ వంతెన సమీపంలో రాజీవ్ రహదారిపై అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకపోయినప్పటికీ డ్రైవర్ చెన్నూరి రాజయ్య తీవ్రగాయాల పాలయ్యాడు. అతడిని 108 సిబ్బంది గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

• ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయండి

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోట గ్రామానికి చెందిన జల్లి సునీత-రమేశ్ దంపతులు కడు నిరుపేదలు. తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని మంగళవారం ఎంపీడీవో భాస్కర్‌రావుకు వినతిపత్రం అందజేశారు.

• ఆలయంలో పరమ పదోత్సవం

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోట శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీమదఖిలాండ కోట బ్రహ్మాండ నాయకుడు శ్రీవేంకటేశ్వరస్వామి తిరుకళ్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో పరమపదోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం ప్రాబోధకి, సేవాకాలం, శాత్తుముర్రై, తీర్థ ప్రసాద వినియోగం, సాయంత్రం సేవాకాలం, పురపాట్టు సేవ, నమ్మళ్వార్, ఆరగింపు, శాత్తుముర్రై తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

• దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా తొలగించాలి

రామగుండం: హిందూ మతంలోని దళితులు క్రైస్తవులుగా మారితే వారిని ఎస్సీలుగా పరిగణించరాదని, వారికి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం వర్తించకుండా చేయాలని, సంక్షేమ పథకాలను నిలిపివేయాలని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు భూసిపాక సంతోష్ మహారాజ్ కోరారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

• వరిపంట దగ్ధం

మంథని: మండలంలోని ఆరెంద గ్రామంలో ఆరెపల్లి సాంబయ్యకు చెందిన వరి పంట మంగళవారం దగ్ధమైనట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు. మూడున్నర ఎకరాల్లో బాస్మతి రకం వరి సాగు చేయగా.. పంట కోసి ఆరబెట్టారు. మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో పంట కాలిపోయిందని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పివేశారు. సాంబయ్యకు సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు.

• ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ఇంటిని తొలగించాలి

మంథని: మంథని మండలంలోని ఖాన్‌సాయిపేటలో ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ఇంటిని తొలగించాలని అదే గ్రామానికి చెందిన కుడుదుల రాజయ్య మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇంటి నెంబర్‌తో ఇల్లు నిర్మించారని ఆరోపించారు. పాత ఇంటి హద్దులు వేరుగా ఉండగా ప్రభుత్వ భూమిలో పాత ఇల్లు హద్దులు చూపించి ఇల్లు నిర్మించారని తెలిపారు.

• గురుకులంలో అడ్మిషన్ ఇవ్వండి

ధర్మారం: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకులం విద్యాలయంలో ప్రవేశం కోసం ప్రభుత్వం నిర్వహించిన ఎంట్రెన్స్ పరీక్షలో అర్హత సాధించినప్పటికీ వయసు తక్కువగా ఉందన్న కారణంతో అడ్మిషన్ ఇవ్వడం లేదని మండలంలోని శాయంపేటకు చెందిన దయ్యాల రమేశ్, ధర్మారం గ్రామానికి చెందిన కాంపెల్లి రాజమల్లు ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతిపత్రం అందించారు. రమేశ్ కుమారుడు మనీంద్ర సాయంపేట ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి పూర్తిచేశాడు. గురుకులం ఎంట్రెన్స్ పరీక్ష రాసి అర్హత సాధించాడు. నందిమేడారం బాలుర గురుకులం విద్యాలయంలో సీటు వచ్చిందన్నారు. అయితే మనీంద్రకు వయస్సు తక్కువగా ఉందనే కారణంతో సదరు ప్రిన్సిపాల్ అడ్మిషన్ ఇవ్వడం లేదని విద్యార్థి తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా కాంపెల్లి రాజమల్లు కూతురు కీర్తన ధర్మారంలోని ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదివి ఎంటెరెన్స్ రాయగా మండలంలోని మల్లాపూర్ సాంఘిక సంక్షేమ బాలికల విద్యాలయంలో సీటు సాధించింది. తమ కూతురుకు సరిపడా వయస్సు లేదని అడ్మిషన్ ఇవ్వడం లేదని ఆయన ఆందోళన చెందారు. తమ కుమారుడు, కూతురికి అడ్మిషన్ ఇప్పించాలని వారు కోరారు.

కేటీఆర్‌ను కలిసిన కోరుకంటి



కేటీఆర్‌కు మొక్క అందజేస్తున్న చందర్

గోదావరిఖని: రాష్ట్ర బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో కలిసి మొక్క అందజేసి బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతమైన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

చీఫ్ మెడికల్ ఆఫీసర్‌కు సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ఆర్జీ-1 ఏరియాలో అడిషనల్ మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన డాక్టర్ ఆర్.రాజ్‌కుమార్ ఇటీవల సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా ప్రమోషన్ ద్వారా కొత్తగూడెంకు బదిలీపై వెళ్లారు. ఆర్జీ-2 ఏరియా ఏఐటీయూసీ నాయకులు మంగళవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి వెంకట్, కందుకూరి రాజారత్నం, యాదగిరి ఉన్నారు.

శ్రమశక్తి అవార్డు గ్రహీతకు సన్మానం

గోదావరిఖని: శ్రమశక్తి అవార్డు గ్రహీత ఎండీ అక్రమ్‌ను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఓసీపీ-3 టైర్ సెక్షన్‌లో జరిగిన కార్యక్రమంలో సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.


మట్టి అక్రమ రవాణాపై చర్యలు తీసుకోండి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం దేవునిపల్లిలో గతేడాది చెరువు నుంచి తీసి నిల్వ ఉంచిన మట్టిని రంగాపూర్, సబ్బితం ఎస్సారెస్పీ కాలువల మీదుగా ఎలాంటి వేబిల్లులు లేకుండా తరలిస్తున్నారని మంగళవారం సబ్బితం మాజీ సర్పంచ్ చంద శంకర్ కలెక్టర్ శ్రీహర్ష, మైనింగ్ అధికారి శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్సారెస్పీ కాలువ రోడ్డు ధ్వంసం అయిందన్నారు. ఓవర్‌లోడ్‌తో వేగంగా వస్తున్న మట్టి టిప్పర్లతో ప్రమాదాలు సైతం జరుగుతున్నాయని తెలిపారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

భూముల పరిశీలన

కమాన్‌పూర్: మండలంలోని నాగారం గ్రామపంచాయతీ లింగాల శివారులోని సర్వే నంబర్ 84లో గల భూములను మంగళవారం తహసీల్దార్ వాసంతి పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. సర్వే నంబర్ 84లో ప్రభుత్వ భూమి ఉందని, ఆ భూమిని ఐకేపీ కొనుగోలు కేంద్రానికి కేటాయించాలని నాగారం, లింగాల గ్రామాలకు చెందిన రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు లింగాల శివారులోని భూముల పరిశీలనకు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూములకు సంబంధించిన ధృవపత్రాలు ఉంటే తీసుకొని రావాలని సూచించారు. ఆర్ఐ వాసంతి ఉన్నారు.

వన్ నేషన్.. వన్ ఎలక్షన్‌పై అవగాహన



మాట్లాడుతున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: దేశవ్యాప్తంగా ఒకేసారి పార్లమెంట్, అసెంబ్లీ, స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని బీజేపీ రాష్ట్ర నాయకురాలు సోమారపు లావణ్య అన్నారు. పెద్దపల్లి మండలం సబ్బితంలో మంగళవారం వన్‌నేషన్.. వన్ ఎలక్షన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఏకకాలంలో ఎన్నికలు జరిగితే ఖర్చు తగ్గడంతో పాటు అవినీతిని నియంత్రించొచ్చని వివరించారు. నాయకులు రాజగోపాల్, ఈర్ల శంకర్, ఉమేశ్, సదానందం, శివయ్య, కిష్టయ్య, గుర్రాల కిట్టు, యాదగిరి, కొమురయ్య, ప్రేం, అశోక్, అంజయ్య, భూమయ్య పాల్గొన్నారు.



ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ సంజయ్ గాంధీ నగర్‌లో కొన్ని నెలలుగా నగరపాలక సంస్థ పారిశుధ్య సిబ్బంది నాలాలలో పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేయకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రామగుండం నగరపాలక సంస్థ అధికారులు స్పందించి కాలువలో పేరుకుపోయిన చెత్త తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

మృతుడి కుటుంబానికి రూ.82లక్షల ఎక్స్‌గ్రేషియా



అధికారులతో మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

గోదావరిఖని: జీడీకే-5 ఓసీపీ ప్రయివేట్ ఓబీలో ట్యాంకర్ పల్టీ పడి కాంట్రాక్టు సూపర్‌వైజర్ వికాస్‌కుమార్ మృతి చెందగా అతడి కుటుంబానికి రూ.82లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు అంగీకారం కుదిరినట్లు కార్మిక సంఘాల నాయకులు జనక్‌ప్రసాద్, తుమ్మల రాజారెడ్డి, రియాజ్‌అహ్మద్, యాదగిరి సత్తయ్య, మడ్డి ఎల్లయ్య తెలిపారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకు ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్‌తో జరిగిన చర్చలు కొలిక్కివచ్చాయని పేర్కొన్నారు. ప్రయివేట్ ఓబీ పీసీపటేల్ కంపెనీ యాజమాన్యం రూ.42లక్షలు, ఇన్సూరెన్స్ కింద రూ.40లక్షల నష్ట పరిహారం ఇప్పించేందుకు అంగీకారం కుదిరినట్లు పేర్కొన్నారు. ఒప్పందం అనంతరం కార్మికుని శవానికి పోస్టుమార్టం నిర్వహించి బిహార్ తీసుకెళ్లారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గోదావరిఖని ఏసీపీ రమేశ్ ఆధ్వర్యంలో ఏరియా ఆసుపత్రి వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

అనుమానిత కాలనీల్లో కార్డెన్‌సెర్చ్ నిర్వహించాలి





రామగుండం: వినతిపత్రం ఇస్తున్న బీజేపీ ప్రతినిధులు, వినతిపత్రం ఇస్తున్న బీజేపీ శ్రేణులు

రామగుండం: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని అనుమానిత ప్రదేశాలు, కాలనీల్లో అక్రమంగా తలదాచుకుంటున్న పాకిస్తానీయులను గుర్తించేందుకు పోలీసు ఉన్నతాధికారులు, రెవెన్యూ బృందాలు కార్డెన్‌సెర్చ్ నిర్వహించాలని బీజేపీ నాయకులు కోరారు. రామగుండం తహసీల్దార్ శ్రీపాద ఈశ్వర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. బీజేపీ జిల్లా వన్ నేషన్ వన్ ఎలక్షన్ కన్వీనర్ సోమారపు లావణ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుల్వ లక్ష్మీనర్సయ్య, మహావాది రామన్న, గోపగోని నవీన్, బైరం కుమార్, మల్లేశ్, శ్రావణ్‌రాజు ఉన్నారు.

పాకిస్తాన్ జాతీయులను దేశం నుంచి పంపించాలి

బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం స్థానిక నేతలు రామగుండం తహసీల్దార్ శ్రీపాద ఈశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. దేశ భద్రతలో భాగంగా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని అనుమానిత కాలనీల్లో పోలీసులు, రెవెన్యూ అధికారులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించి పాకిస్తాన్ జాతీయులను గుర్తించి వారి సొంత దేశాలకు పంపించాలని కోరారు. బీజేపీ ఎన్టీపీసీ మండల అధ్యక్షుడు మిట్టపల్లి సతీశ్‌కుమార్, జనగామ మండల అధ్యక్షుడు గుండబోయిన భూమయ్య, ఊరగొండ అపర్ణ, కోడూరి రమేశ్, తోట కుమారస్వామి, పల్లికొండ నర్సింగ్, పెరక రవీందర్, గుండబోయిన పృథ్వీ, బుసిపాక సంతోష్, దబ్బెట కమలాకర్, కుడుముల సంజీవ్, రేగొండ సంతోష్, గాండ్ల శివకృష్ణ, మేడి నవీన్, గుమ్ముల సంపత్, గజ్జెల భాస్కర్, మేర్గు శ్రీనివాస్, శివ, రమేశ్ ఉన్నారు.

ఓదెల తహసీల్దార్‌కు వినతి

ఓదెల: పాకిస్తాన్ దేశీయులు వెంటనే దేశం వదిలిపోవాలని ఓదెల మండల అధ్యక్షుడు కారెంగల శ్రీనివాస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ సునీతకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తీర్థాల కుమార్, నాయకులు మేరుగు రంగన్న, రాంనేని రాజేంద్రప్రసాద్, ఎండాడి కుమార్, వంగరి చందు, పోలోజు శ్రీహరి, దుర్శిటి లక్ష్మణ్, మద్దెల అజయ్ ఉన్నారు.

పాకిస్తాన్ పౌరులను గుర్తించి పంపించాలి

ఎలిగేడు: తదేశంలో ఉన్న పాకిస్తాన్ జాతీయులు వెంటనే దేశం విడిచి వెళ్లిపోవాలని బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఎలిగేడు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ బి.కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పార్టీ సీనియర్ నాయకులు కలువల శ్రీనివాసరెడ్డి, నాయకులు అడ్డగుంట తిరుపతిగౌడ్, నివాస్, ప్రతాప్, రమేశ్ ఉన్నారు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

జ్యోతినగర్: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు లేబర్ గేట్ వద్ద రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గీట్ల లక్ష్మారెడ్డి, నాంసాని శంకర్ మంగళవారం పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. యూనియన్ నాయకులు ఎం.రామాచారి, రాఘవరెడ్డి, మల్లయ్య, శ్రీనివాస్, ప్రభాకర్, వెంకటేశ్, అజయ్, పోచం, అలీ, రాంరెడ్డి, మోహన్, నర్సయ్య పాల్గొన్నారు.

నోటీసులు అందజేత

రామగుండం: దేశవ్యాప్త జాతీయ సమ్మెను అన్నివర్గాల కార్మికులు విజయవంతం చేయాలని సీఐటీయూ రామగుండం ఏరియా కన్వీనర్ గీట్ల లక్ష్మారెడ్డి కోరారు. మంగళవారం రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్, బీపీసీఎల్ పెట్రోల్ బంకుల యజమాన్యాలకు 20న జరిగే సమ్మె నోటీసులు అందజేశారు. కనీస వేతనం రూ.26వేలకు పెంచాలని, అసంఘటిత రంగ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి ఎం.రామాచారి తదితరులు ఉన్నారు.

సమ్మె విజయవంతం చేయండి

కమాన్‌పూర్: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ 20న కేంద్ర కార్మిక సంఘాలు నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జ్యోతి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం ఆశావర్కర్లతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. రమాదేవి, అమృత, స్వరూప, సునీత, హేమలత, శ్యామల, రాజేశ్వరి, గౌతమి పాల్గొన్నారు.